
సివిల్ అసిస్టెంట్ సర్జన్ ప్రభుత్వానికి సరెండర్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పని చేసే సివిల్‌అసిస్టెంట్ సర్జన్ చంద్రశేఖర్‌ను ప్రజా ఆరోగ్య, కుటుంబ సంచాలకులకు సరెండర్ చేసినట్లు సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆసుపత్రి పరిశీలనకు వచ్చిన సందర్భంగా సివిల్ అసిస్టెంట్ సర్జన్ చంద్రశేఖర్ ఎంఐసీయూ వార్డులో పేషెంట్లతో దురుసుగా ప్రవరిస్తూ వైద్య వృత్తికే అవమానకరంగా వ్యవహరించడం, ఆసుపత్రిలో రోగుల సేవలకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులతో దురుసుగా ప్రవరిసున్నారని, ఎటువంటి సమాచారం లేకుండా రెండు రోజులపాటు విధులకు గైర్హాజర్ కావడంతోపాటు పలు ఫిర్యాదులు కలెక్టర్‌కు అందడంతో చంద్రశేఖర్‌ను సరెండర్ చేయాలని కలెక్టర్ ఆదేశించినట్టు సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

అకాల వర్షాలకు 3566.23 ఎకరాల్లో పంట నష్టం

పెద్దపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి, ఏప్రిల్ నెలలో కురిసిన అకాల, వడగళ్ల వర్షాలకు 3566.23 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, వివిధ రకాల పంటలను రైతులు నష్ట పోయారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు. సంబంధిత రైతులకు నష్ట పరిహారం మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపించామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 21న కురిసిన వర్షానికి 505.23 ఎకరాల్లో వరి, 642.07 ఎకరాల్లో మొక్కజొన్న, 4.11 ఎకరాల్లో నువ్వు, 3.15 ఎకరాల్లో పెసర, 20 ఎకరాల్లో కూరగాయలు, మొత్తం 1175. 16 ఎకరాల్లో పంటలు నష్టపోయాయని తెలిపారు. ఏప్రిల్ 15న కురిసిన వర్షాలకు 2278.07 ఎకరాల్లో వరి, 113 ఎకరాల్లో మామిడి నష్టపోయారని పేర్కొన్నారు.

- ప్రమాదంలోనే బ్యారేజీలున్నాయని ఎన్‌డీఎస్‌ఏ నివేదిక
- తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణంపై ప్రభుత్వ ం దృష్టి
- వరుణుడు కరుణిస్తేనే సాగు, తాగు నీరు



శ్రీపాద ఎల్లంపల్లి బ్యారేజీలోకి నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యం (ఫైల్)

కాళేశ్వరం ఎత్తిపోతలు లేనట్లే..!

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నిర్మించిన మూడు బ్యారేజీలు ప్రమాదంలోనే ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీంతో ఈ ఏడాది కూడా బ్యారేజీల్లో నీటి నిల్వ చేసి నీటిని ఎత్తిపోసే పరిస్థితులు కనబడడం లేదు. సమగ్ర పునర్నిర్మాణం, రీడిజైన్ చేయాలని పేర్కొంది. నిర్మాణం, డిజైన్ లోపాలు, నాణ్యతలో తనిఖీ లోపాల కారణంగా మూడు బ్యారేజీలకు పెను నష్టం జరిగిందని పేర్కొన్నారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణాలను ఒక చోటి నుంచి మరో చోటికి మార్చారు. ఈ క్రమంలో భూసార పరీక్షలు, భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలను నిర్వ హించకుండానే నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ కాణంగానే ఆ బ్యారేజీలు దెబ్బతిన్నాయని చెబుతు న్నారు. దీంతో ఈ ఏడాది మేడిగడ్డలో కాకపోయినా అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసే అవకాశాలు కనబడడం లేదు. వరుణుడు కరుణిస్తేనే శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎగువ ప్రాంతానికి నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది.



సుందిళ్ల బ్యారేజీ నుంచి దిగువకు నీటిని వదులుతున్న దృశ్యం (ఫైల్)

● రివర్స్ ఎత్తిపోతల ద్వారా బ్యారేజీల నిర్మాణం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత- చేవేళ్ల ప్రాజెక్టుకు రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. ప్రాణహిత నదిపై తుమ్మడిహెట్టి వద్ద కాకుండా గోదావరి నదిపై కాళేశ్వరానికి దిగువన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద మూడు బ్యారేజీలను నిర్మించి పంప్‌హౌస్‌ల ద్వారా రివర్స్ ఎత్తిపోతలు చేపడుతూ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో యేటా 160 టీఎంసీల నీటిని ఎత్తిపోసే విధంగా నిర్మించారు. 2016 మే 2న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శరవేగంగా మూడు బ్యారేజీలను 2019లో పూర్తి చేశారు. ప్రాజెక్టును ఆరంభించి జాతికి అంకితం చేశారు. యేటా 160 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాలేదు. నాలుగేళ్లలో 163 టీఎంసీం నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోశారు. అలాగే భారీ వర్షాలకు ఎల్లంపల్లి నుంచి 2023 వరకు నాలుగేళ్లలో 2 వేలకు పైగా టీఎంసీల నీటిని గోదావరిలోకి వదిలిపెట్టారు. 2023లో కురిసిన భారీ వర్షాలకు మేడిగడ్డ బ్యారేజీ నుంచి పెద్ద ఎత్తున నీటిని దిగువకు వదిలారు. అక్టోబర్‌లో భారీ శబ్దంతో 7వ బ్లాకులోని రెండు పియర్లు కుంగిపోయి పగుళ్లు బారాయి. అన్నా

(మిగతా 8వ పేజీలో)

• వరుణుడు కరుణిస్తేనే సాగు, తాగు నీరు..

గతేడాది కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయక పోయినా భారీగా కురిసిన వర్షాల వల్ల శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మీదుగా మిడ్ మానేరుకు అక్కడి నుంచి రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, ఎల్‌ఎండీలకు నీటిని తరలిం చారు. ప్రస్తుతానికి ఎల్లంపల్లిలో 7 టీఎంసీల వరకు ఉండగా, వర్షాకాలం సీజన్ ఆరంభమై వర్షాలు కురిసే నాటికి ఎల్లంపల్లి డెడ్ స్టోరేజీ చేరుకోనున్నది. వర్షాలు కురియకుంటే మాత్రం సాగు, తాగు నీటికి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సిందే. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌కు అబుల్ కలాం సుజల స్రవంతి పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తు న్నారు. ఎన్టీపీసీ, టీఎస్‌టీపీపీ, ఆర్ఎఫ్‌సీఎల్‌కు నీటి సరఫరా చేయడంతోపాటు పెద్దపల్లి, రామగుండం, మంథని, జగిత్యాల, ధర్మపురి, మంచిర్యాల నియోజక వర్గాలకు మిషన్ భగీరథ ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఎల్లంపల్లి కింద లక్ష ఎకరాలకు పైగా భూములకు సాగు నీటిని అందిస్తున్నారు. వర్షాలు కురియకుంటే ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కనకయ్య సర్వే నెంబర్ 778 లో 30 గుంటలు, 779 లో 30 గుంటల భూమి ఉందని, భూ భారతి ద్వారా పట్టా ఇప్పించాలని దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన డి.నరేందర్ ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 76 ప్రకారం సర్వే నంబర్ 68లో 125 చదరపు గజాల భూమి తల్లికి వచ్చిందన్నారు. ఆమె 2020 అక్టోబర్ 18 న మరణించారని ఆ భూమిని తమ పేరు మీద మార్చాలని దరఖాస్తు చేసుకొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు, పాల్గొన్నారు

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కర్రె గుట్ట ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు నిర్వహించాలని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దులో గల కర్రెగుట్ట యుద్ధక్షేత్రాన్ని తలపిస్తుందన్నారు. సరిహద్దు ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆదివాసి, గిరిజనులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయానక వాతావరణంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది సాయుధ పోలీస్ బలగాలు తిష్ట వేసుకుని ఏకపక్ష దాడుల్ని కొనసాగించడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. అడవి, ప్రకృతి ఖనిజ సంపదను అంబానీ, ఆదానీలకు అప్పచెప్పే కుట్రలో భాగంగానే ఆదివాసి ప్రాంతాల్లో మావోయిస్టుల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కర్రెగుట్ట ప్రాంతం నుంచి పోలీస్ బలగాలను వెంటనే ఉపసంహరించాలని, అరెస్టు చేసిన ఆదివాసి గిరిజనులను వదిలిపెట్టాలని, ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సూచించారు. మావోయిస్టు పార్టీ ఇటీవలి కాలంలో శాంతి చర్చలకు తాము సిద్దమని పదే పదే ప్రకటిస్తున్నా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ నరేష్, నాయకులు బి అశోక్, చిలుక శంకర్, రాజేశం, కొల్లూరి మల్లేష్, చంద్రయ్య, కాదాసి లింగమూర్తి, గుండేటి మల్లేశం పాల్గొన్నారు.

ఎటుచూసినా ధాన్యం రాశులే

- కొనుగోలు కేంద్రాల నిండా ధాన్యం
- అకాల వర్షాలతో ఇబ్బందులు
- త్వరగా కొనుగోలు చేయాలంటున్నరైతులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో అత్యధికంగా ధాన్యం దిగుబడులు వచ్చాయి. రైతులు కోతలు పూర్తి చేసుకొని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించారు. మండలంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాసులు ఇబ్బడి ముబ్బడిగా చేరుకున్నాయి. కేంద్రాల ఆవరణ అంతా ధాన్యం నిలువలతో నిండిపోతున్నాయి. సీజన్ ఆరంభంలోనే సకాలంలో వర్షాలు కురవడం, కుంటలు, చెరువులు నిండడం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువల ద్వారా సాగు నీరందడం పంటలకు ప్రాణం పోశాయి. వరి కోతలు పూర్తయి ధాన్యం కేంద్రాల వద్దకు తీసుకువచ్చారు. దీంతో ఈ నెల 14న తర్వాత అన్ని గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

● ఎక్కడ చూసినా ధాన్యం రాసులే.·

సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణ మొత్తం రైతులు ధాన్యం దిగుబడితో నిండిపోయింది. మండలంలోని గర్రెపల్లి సబ్ మార్కెట్ యార్డులో కూడా పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు చేరుకున్నాయి. ఇలా అన్ని కేంద్రాలలో నిల్వలు పేరుకుపోయాయి. చాలా మంది రైతులు పొలాల కోతల అనంతరం నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. కోతలు పూర్తయిన తర్వాత కేంద్రాలకు తీసుకుపోవడం, వాటిని ఆరబెట్టడం, రోజుల తరబడి నిల్వలకు రక్షణ ఉండడం వంటి ఇబ్బందులతో ధర తక్కువైనా రైతులు నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు.



సుల్తానాబాద్ మార్కెట్‌లో ధాన్యం రాశులు

వేగవంతంగా ధాన్యం కొనుగోళ్ళు



\- మినుపాల ప్రకాశ్ రావు, మార్కెట్ చైర్మన్

సుల్తానాబాద్ మార్కెట్ యార్డు పరిధిలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశాం. అకాల వర్షాల సమస్య ఉండడంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హమాలీలను అందుబాటులో ఉంచుతూ సరిపడా లారీలు సమకూర్చుకుంటున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే ఆయా రైస్ మిల్లులకు తరలిస్తున్నాం.

48 గంటలలో రైతు ఖాతాలలో డబ్బులు



\- సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్

నిబంధనలకు లోబడి ధాన్యం తీసుకుని వచ్చిన రైతుల ధాన్యాన్ని వెంటనే కాంటా వేయిస్తున్నాం. కాంటా వేసిన 48 గంటలలోనే డబ్బులను రైతుల ఖాతాలో జమ చేస్తున్నాం. రైతులు ఎలాంటి సమస్య ఉన్నా తమను సంప్రదించాలి. ధాన్యాన్ని కేంద్రాల ఆవరణలోనే ఆరబెట్టుకుంటున్నారు. దీంతో స్థల సమస్య ఏర్పడుతుంది. కల్లాల వద్దనే ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకొనిరావాలి.

అకాల వర్షాలతో ఇబ్బందులు



\- గిరుగుల రంగయ్య రైతు దుబ్బులపల్లి

ఆరు ఎకరాలలో సాగు చేసి కోతలు పూర్తి చేసి మూడు రోజుల క్రితం సుల్తానాబాద్ మార్కెట్‌కు ధాన్యం తెచ్చి ఆరబోసుకున్నాం. తేమ శాతం వచ్చింది. సోమవారం కాంటా వేస్తామన్నారు. ఆదివారం వర్షం కురిసి ధాన్యం తడిసి పోయింది. తేమ శాతం పడిపోయింది. తడిసిన ధాన్యాన్ని మళ్ళీ ఆరబెట్టడం ఇబ్బందిగా మారింది.

వెంట వెంటనే కొనుగోళ్లు చేయాలి



కుందేళ్ల కొమురయ్య రైతు గర్రెపల్లి

కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని నిర్వాహకులు వెంట వెంటనే కాంటా వేయించి రైతులను ఆదుకోవాలి. ఆలస్యం చేస్తే అకాల వర్షాల వలన నష్టపోవాల్సి వస్తుంది. కోతలు ముందే పూర్తి చేసి కొనుగోలు కేంద్రం ప్రారంభించక వారం రోజుల ముందే ధాన్యాన్ని కేంద్రంలో ఉంచాం. రై తుల ఇబ్బందుల గమనించి వెంటనే కొనుగోళ్ల చేయాలి.

వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



సమ్మర్‌క్యాంపు నిర్వహణపై మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో జిల్లాలోని అన్ని గ్రామాలలో 1నుంచి 7వ తరగతి చదివే విద్యార్థులకు మే1 నుంచి జూన్ 10 వరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. 400మంది వలంటీర్లతో 305ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. వలంటీర్లు విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగే విధంగా గైడెన్స్ ఇస్తారని కలెక్టర్ అన్నారు. విద్యార్థులకు గొప్ప లక్ష్యాలను ఏర్పచుకోవడం నేర్పాలని, ముఖ్య పాఠ్యాంశాలను బోధించడం, క్రీడలు, నీతికథలు, చదువు ప్రాముఖ్యత, విలువలు బోధిస్తామని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను సమ్మర్ క్యాంపునకు పంపాలని, వలంటీర్లకు గౌరవ వేతనం ఇస్తామని పేర్కొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధర్మారం, జూలపల్లి మండలాలకు చెందిన వలంటీర్లకు ఎంఈవో ప్రభాకర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో తెలుగు, ఆంగ్లంలో భాష నైపుణ్యం పెంచడంతోపాటు గణితంను సులభతరం, చిత్రలేఖనం, ఇన్‌డోర్ గేమ్స్ తో సృజనాత్మకతను పెంచేందుకు సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తోంది. ధర్మారం మండలం నుంచి 20 మంది. జూలపల్లి మండలం నుంచి ఏడుగురు వలంటీర్లను నియమించారు. వీరికి డిస్ట్రిక్ట్ రీసోర్స్‌పర్సన్స్ దేవేందర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు మెలకువలు నేర్పించారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఎంఈవో హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలి పారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం 11 మంది వలంటీర్లతో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ఊషన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించాలని ఆయన కోరారు.

వైద్యాధికారిపై కేసు ఉపసంహరించుకోవాలి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) గోదావరిఖని ప్రైవేట్ ఆసుపత్రి తనిఖీలో భాగంగా జిల్లా వైద్యాధికారిని దుర్భాషలాడి అధికారిపైనే పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ హెచ్ 1 యూని యన్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి లక్ష్మన్, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి ఆలూరి సీతారామయ్య డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో సోమవారం విలేకరులతో మా ట్లాడుతూ వైద్యాధికారికి ఆసుపత్రి యాజ మాన్యం క్షమాపణ చెప్పాలని, ఆమెపై తప్పుడు ఫిర్యాదును వాపస్ తీసుకోవాల న్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ వాడడం తప్పని, అధికారులను బెదిరింపులకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రి యాజమాన్యంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. వారి వెంట యూనియన్ సలహాదా రులు శ్రీనివాస్ వినీత్, సంపూర్ణ, ఉపాధ్య క్షులు అట్టెం నాగమణి, సరస్వతి, వసంత, లక్ష్మీ, వీరేశం, శోభారాణి, ఎల్జిబత్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు దారుణహత్య

● వివాహేతర సంబంధమే కారణం 6

ప్రభుత్వ పాఠశాలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలి 7

రవాణాశాఖ పేర వసూల్ దందా

- డీజిల్ పోయాలని సింగరేణి ఓసీపీలోనూ జబర్దస్తీ
- అధికారుల పేర్లు చెప్పి వసూళ్లు
- ఖనిలోని ఒక హోటల్‌లో సెటిల్‌మెంట్లు

కోల్‌సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖలో ఒక వసూల్‌రాజ్ వ్యవహారం రామగుండంలో చర్చనీయాంశంగా మారింది. శాఖతో సంబంధం లేని వ్యక్తి వాహనాల యజమానులకు వసూళ్ల విషయంలో టార్గెట్లు పెట్టడం, స్పందించకపోతే జరిమానాల పేర రెట్టింపు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రామగుండం రీజియన్‌లోని ఒక ఓపెన్‌కాస్టులో రవాణాశాఖ పేరు చెప్పి వాహనంలో డీజిల్ పోయమని సదరు వ్యక్తి జబర్దస్తీ చేయడంతో అక్కడ విధుల్లో ఉన్న వారితో పాటు తోటి ఉద్యోగులు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. సదరు శాఖలోని అధికారులకు నెలకు 150లీటర్ల చొప్పున డీజిల్ పోయాల్సి ఉందని, అదనంగా పోయాలనడంతో వివాదం చెలరేగింది. ఇండెంట్ లేనిదే డీజిల్ పోయమని చెప్పడంతో సింగరేణి వాహనాలు బయట ఎలా తిరుగుతాయో చూస్తామంటూ హెచ్చరించి మరీ వెళ్లడంతో సదరు ఉద్యోగులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై సింగరేణి విజిలెన్స్ విభాగం కూడా విచారణ జరుపుతున్నట్టు తెలుస్తోంది. బూడిద, బొగ్గు, మట్టి, ఇసుక ట్రాన్స్‌పోర్టులు, ట్రావెల్స్, ఇటుక బట్టీల వాహనాలు ఇలా వివిధ రకాల వాహనాలకు టార్గెట్లు పెడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత వ్యక్తే నేరుగా వాహనాల యజమానుల వద్దకు వెళ్లి ఎంత డబ్బులు కట్టాలనే విషయంపై టార్గెట్ నిర్దేశించడం, అందుకు నిరాకరిస్తే భారీ జరిమానాలు పడే విధంగా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గోదావరిఖని పట్టణంలోని ఒక హోటల్‌లో రోజూ ఈ తరహా సెటిల్‌మెంట్‌లకు అడ్డా చేసుకున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. రవాణాశాఖలో రామగుండంలో తాను చెప్పిందే వేదం అనే రీతిలో సదరు ప్రైవేట్ వ్యక్తి వ్యవహారాలు సాగిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఈ వసూళ్ల వేధింపులను కట్టడి చేయడంలో సంబంధిత శాఖ చర్యలు తీసుకోకపోవడం పట్ల వాహనాల యజమానుల్లో అసంతృప్తి వ్యక్తమవుతుంది.

ఎల్‌ఎండీలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


నరసమ్మ(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువమానేరు జలాశయంలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన ప్రకారం.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామానికిచెందిన కెడిక నరసమ్మ (60) తన భర్తతో కలిసి ఉంటోంది. వారి కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అయితే నరసమ్మ భర్త తిరుపతి రెడ్డికి ఇటీవలే హార్ట్‌స్ట్రోక్ వచ్చి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో నరసమ్మ తన భర్తకు సేవచేస్తూ ఆమె కూడా అనారోగ్యానికి గురైంది. కుమారులు కూడా అందుబాటులో లేకపోవడంతో తమని చూసుకొనే వారులేరని మనస్తాపం చెందింది. ఆదివారం ఈనెల27న కరీంనగర్ వెళ్లి వస్తానని భర్తకు చెప్పి సాయంత్రం ఇంట్లో నుంచి బయలుదేరింది. రాత్రి ఇంటికి వెళ్లకుండా నరసమ్మ ఎల్ఎండీలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం ఉదయం మానేరుడ్యాంలో మృతదేహం కనిపించడంతో స్థానికులు ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని వెలికితీసి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అయితే మృతదేహం ఎవరిదనే సమాచారం లేకపోవడంతో సోషల్‌మీడియాలో మృతురాలికి సంబంధించిన వివరాలు పెట్టడంతో వైరల్ అయ్యాయి. దీంతో సోషల్‌మీడియా ద్వారా తెలుసుకున్న మృతురాలి కుటుంబసభ్యులు కెడికనరసమ్మగా గుర్తించి ఎల్ఎండీ పోలీసులను సంప్రదించారు. మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి బలవన్మరణం


జంగ మల్లయ్య(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌లో నివాసముండే జంగ మల్లయ్య(80) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నిరోజుల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. కూతుళ్లు, కొడుకు వద్దకు వెళ్లకుండా ఒంటరిగా ఉంటున్నాడు. ఒంటరితనంతో మనస్తాపంచెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి కూతురు ప్రమీల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీనగర్‌కు చెందిన తిప్పర్తి హరికృష్ణ(35) దుర్మరణం చెందాడు. తిప్పర్తి పరిపూర్ణాచారి అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలుకాగా ఆసుపత్రికి తరలించారు. కోతిరాంపూర్ మూలమలుపు వద్ద కారు అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా హరికృష్ణ మృతిచెందగా, పరిపూర్ణాచారి చికిత్స పొందుతున్నాడు. హరికృష్ణ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

● వరి కోత యంత్రాలతో జాగ్రత్త
● నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలకే ముప్పు

వెల్గటూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): యాసంగి వరి కోతలు ఊపందుకున్నాయి. కూలీల కొరత నేపథ్యంలో జిల్లాలో అన్నదాతలు వరి పంట కోయడానికి కోత యంత్రాలు (హార్వెస్టర్)పై ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. కాగా హార్వెస్టర్లు నడిపే పలువురు ఆపరేటర్ల అజాగ్రత్త ప్రతీ ఏటా ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ సంఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు అంగవైకల్యంతో జీవితాంతం బాధపడుతున్నారు. ఆపరేటర్ల కొరత వలన ఎక్కువ గంటలు విశ్రాంతి లేకుండా పని చేయడం వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, అగ్నిమాపక, రవాణా శాఖ అధికారులు హార్వెస్టర్ల యజమానులు, ఆపరేటర్లకు నిబంధనలు, రక్షణ చర్యలపై సీజన్ ఆరంభం ముందే అవగాహన కల్పిస్తే ప్రమాదాలు నివారించే అవకాశం ఉంది.

ఆపరేటర్లు పాటించాల్సిన జాగ్రత్తలు

- హార్వెస్టర్ విడి భాగాలు సరిగా పనిచేస్తున్నదీ.. లేనిదీ పొలంలోకి దిగక ముందే సరిచూసుకోవాలి.
- పని లేనపుడు వాలు ప్రదేశాల్లో నిలిపి ఉంచడం, టైర్ల కింద రాళ్లు అడ్డుపెట్టడం ప్రమాదకరం.
- యంత్రం మరమ్మతుకు గురైతే నిపుణులతోనే తనిఖీ చేయించాలి.
- కన్వేయర్ బెల్టు వంటి భాగాలు మరమ్మతు చేయాల్సి వస్తే అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలి.
- వర్షం, పొగమంచు సమయాల్లో పొలంలో నీళ్లు ఎక్కువగా ఉన్నప్పుడు కోత పనులు చేయవద్దు.
- ఇంజన్ స్విచ్ ఆఫ్ చేయకుండా ఏ పని చేయొద్దు.
- బురద ఉన్నపుడు కోత పనులు చేస్తే యంత్రాలు అందులో కూరుకునే ప్రమాదముంది.

రైతులు, కూలీలు పాటించాల్సినవి..

- హార్వెస్టర్ వెనుక భాగం ఆపరేటర్‌కు కనిపించదు. కోత కోసే సమయంలో ముఖ్యంగా చిన్న పిల్లలు, దివ్యాంగులు యంత్రాల వద్దకు వెళ్లవద్దు.
- హార్వెస్టర్ కదులుతున్నపుడు ఎక్కడం, దిగడం చేయవద్దు.
- రహదారులు, పొలాల్లో అడ్డు వచ్చే కరెంటు తీగలను ఎండిన కర్ర, లేదా రబ్బరు, ప్లాస్టిక్ సాధనాలతో పక్కకు తొలగించాలి.
- యాసంగి కోతల సమయంలో యంత్రాల వద్ద అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి.



ఆటో బోల్తా.. ఎనిమిది మందికి గాయాలు

సైదాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం గ్రామంలో సోమవారం ఆటోబోల్తాపడి ఎనిమిది మంది మహిళలకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండల రేగొండ గ్రామానికి చెందిన మైలారం శారద, చెంచల వనజ, బరిగల శారద, రెంటాల స్వరూప, కల్వల లలిత, కనక మమత, గాదెపాక సౌమ్య, రెంటాల వెన్నెల రేకొండ గ్రామంనుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో సోమారం గ్రామసమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్పగాయాలు కాగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి స్వల్పగాయాలు

హుజూరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని వరంగల్ రోడ్‌లో సోమవారం కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రోడ్‌లోని వెంకటసాయి గార్డెన్ సమీపంలో రహదారిపై వస్తున్న కారును తప్పించబోయిన మరోకారు బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలు కాగా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

బోల్తాపడిన సున్నపు లోడ్ లారీ

మానకొండూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామశివారులో సోమవారం సున్నపులోడ్ లారీ బోల్తాపడింది. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళుతున్న సున్నపులోడ్ లారీ గట్టుదుద్దెనపల్లి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

జూలపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుకుంట గ్రామానికి చెందిన సుమలత(31) అనే వివాహిత ఐదు రోజులుగా కనిపించడం లేదని ఆమె భర్తసురేష్ సోమవారం జూలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమలత తో సురేష్‌కు 9 సంవత్సరాల క్రితం వివాహం కాగా వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల వారి మధ్య ఏర్పడిన మనస్పర్థలతో ఈనెల 25నఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిందని సురేష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, సుమలత ఆచూకీ తెలిస్తే 8712658670, 8712656513 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శంకరపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ శివారులో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా దాడిచేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను సోమవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8400 నగదు స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

పెద్దపల్లిలో పట్టపగలు దారుణ హత్య

● వివాహేతర సంబంధమే కారణమా?


పోలం కుమార్ (ఫైల్)


హత్య అనంతరం అక్కడే కూర్చున్న సంతోష్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో సోమవారం పట్టపగలే దారుణ హత్య జరిగింది. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికిచెందిన వేల్పుల సంతోష్ కుమార్.. పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికిచెందిన పోలం కుమార్(35)కు తన భార్యతో వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నాడు. ఈ విషయమై దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఒకసారి మాట్లాడుకుందామని పోలం కుమార్‌ను సంతోష్‌కుమార్ వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రమ్మన్నాడు. సంతోష్ కుమార్ భార్యతో కలిసి మార్కెట్‌యార్డ్‌కు వచ్చాడు. అనంతరం వారిమధ్య వాగ్వాదం చోటుచేసుకొంది.

ఈ క్రమంలో సంతోష్‌కుమార్ వెంట తెచ్చుకున్న కత్తితో పోలంకుమార్‌పై కిరాతంగా దాడిచేశాడు. చనిపోయి తరువాత కూడా మర్మాంగాలపై కాలితో నొక్కి కసి తీర్చుకున్నాడు. దీంతో పోలం కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం సంతోష్‌కుమార్ మృతదేహం ఘటనస్థలం వద్దనే కూర్చొని నీరు తాగుతూ సేదతీరాడు. సంఘటనను చూసిన సంతోష్‌కుమార్ భార్య సొమ్మసిల్లి పడిపోయింది. విషయంతెలుసుకొన్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ఆమెను ఆస్పత్రికి, సంతోష్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ ఘటన జరుగుతున్న క్రమంలో అక్కడ ఉన్న వారు ఫొటోలు, వీడియోలు తీశారే కానీ ఎవరూ అడ్డుకోలేదు. ఈ ఘటనపై డీసీపీ కరుణాకర్ విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఇదిలాఉండగా హత్యకు గురైన కుమార్ భార్య అనిత తన భర్తను సంతోష్, అతడి భార్య శైలజ పథకం ప్రకారమే హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాభర్తని వ్యవసాయ మార్కెట్‌కు రమ్మని ఫోన్‌చేసి చెప్పడంతో కారులో అక్కడికి వెళ్లాడని ఈ క్రమంలో కత్తితో పొడిచి చంపారని పేర్కొంది.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్


అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న గోదావరిఖని ఏసీపీ మడత రమేష్

కమాన్‌పూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ముగ్గురిని కమాన్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో గోదావరిఖని ఏపీపీ మడత రమేష్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. కమాన్‌పూర్ మండలం గుండారం శివారులోని రాజేందర్‌నగర్ వద్ద ముగ్గురు వ్యక్తులు రెండు కిలోల గంజాయి తరలించేందుకు సిద్ధంగా ఉండగా పక్కా సమాచారంతో ఎస్ఐ కొట్టే ప్రసాద్ దాడి చేసి పట్టుకున్నట్టు తెలిపారు. గంజాయిని తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు మండల కేంద్రానికి చెందిన నవలం మల్లేష్, జగిత్యాల జిల్లా గుడిసెలపేటకు చెందిన అలక సందీప్, మద్దెల హరీష్‌లను అరెస్టుచేసినట్లు తెలిపారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఎవరైనా గంజాయి సాగుచేసిన, తరలించిన, విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో గోదావరిఖని టూటౌన్‌సీఐ నక్క ప్రసాద్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నతల్లి కర్కశత్వం

● ప్రతీ రోజు కొడుకుపై దాడి
● గొడ్డును బాదినట్లు బాదుతుండడంతో భరించని ఇరుగుపొరుగు
● రహస్యంగా వీడియో తీసి సఖి అధికారులకు కాలనీవాసుల ఫిర్యాదు
● సఖి సెంటర్‌కు తల్లీకొడుకుల తరలింపు ● జగిత్యాల తులసీనగర్‌లో ఘటన


జగిత్యాల సఖి కేంద్రంలో అధికారుల వద్ద ఉన్న బాలుడు

జగిత్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సభ్య సమాజం తలదించుకునేలా ఓ కన్నతల్లి కర్కశత్వం ప్రదర్శించింది. కొడుకును తల్లే నిత్యం గొడ్డును బాదినట్లు బాదుతోంది.. మూడు సంవత్సరాలు నిండని పసిబిడ్డపై పైశాచికత్వం ప్రదర్శిస్తోంది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసీ నగర్‌లో సోమవారం తల్లి దాష్టీకాన్ని భరించలేని ఇరుగుపొరుగు వారు రహస్యంగా సంఘటనను వీడియో తీసి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తల్లీ కొడుకులను సఖి సెంటర్‌కు అధికారులు తరలించారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఆంజనేయులు అనే వ్యక్తికి రమ అనే మహిళతో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆంజనేయులుకు గతంలో వివాహ జరిగినప్పటికీ మనస్పర్థల కారణంగా భార్యభర్తలు విడిపోయారు. ఈ విషయం వివరించి రమను నాలుగు సంవత్సరాల క్రితం ఆంజనేయులు రెండో వివాహం చేసుకున్నాడు. వీరిరువురు కొద్దికాలం కాపురం చేశారు. రమ ఆరునెలల గర్భవతిగా ఉన్న సమయంలో ఉపాధి నిమిత్తం ఆంజనేయులు దుబాయికి వెళ్లాడు. రమ తులసీనగర్‌లోని తమ ఇంట్లో కొడుకుతో నివాసం ఉంటోంది. కాగా దుబాయిలో ఉన్న ఆంజనేయులుకు జగిత్యాలలో ఉన్న రమకు మధ్య ఇటీవల మనస్పర్థలు వచ్చినట్లు సమాచారం. ఇంకో మహిళతో ఆంజనేయులు దుబాయి నుంచి తరచుగా ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు రమకు అనుమానం వచ్చింది. ఈ నేపథ్యంలో ఇంట్లో బాబు తరుచూ అల్లరి చేస్తుండడంతో చికాకు, మానసిక ఒత్తిడికి గురవుతున్న రమ ఇటీవల తరచూ బాబును కొడుతోంది. గతంలోనూ కొడుకును కిందపడేసి తొక్కుతుండడం, కొట్టడంతో స్థానికులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆ సమయంలో పోలీసులు రమకు కౌన్సెలింగ్ ఇచ్చారని స్థానికులు అంటున్నారు. అయినప్పటికీ రమ పరిస్థితిలో మార్పురాలేదని మళ్లీ పసిబాబును బాదుతుండడం గమనించిన కాలనీవాసులు రహస్యంగా వీడియో తీసి అధికారులకు, సఖి సెంటర్ నిర్వాహకులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి హరీశ్, సఖీ సెంటర్ అడ్మిన్ లావణ్య, ఇతర అధికారులు హుటాహుటిన తులసీనగర్‌లోని రమ నివాసానికి వెళ్లి రమను, బాబును సఖీ సెంటర్‌కు తరలించారు. రమకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

ఇదిలాఉండగా పోలీసులు సైతం సంఘటనపై విచారణ జరుపుతున్నారు. కాగా బాబును కొట్టిన సంఘటనపై తన తప్పును తెలుసుకున్నానని, ఇక ముందు అలా చేయనని, మరోమారు చేసినట్లయితే కఠినచర్యలు తీసుకోవాలని సఖీ సెంటర్ అధికా రులతో రమ వేడుకుంది. రమకు మానసిక ఆరోగ్యం సరిగా లేదని కాలనీవాసులు అంటున్నారు. కాగా సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు వచ్చినా కేసు నమోదు చేయడంతో పాటు సమగ్ర విచారణ చేపడతామని జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

లారీ-ద్విచక్ర వాహనం ఢీ

● యువకుడు మృతి, మరొకరికి గాయాలు


నరేశ్(ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారం దర్గా సమీపంలో సోమవారం లారీ, ద్విచక్రవాహనం ఢీకొని నరేశ్(18) అనేయువకుడు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్యాల మండలం రాంపూర్‌కుచెందిన బోదాసు రాజు కుమార్, అల్లెపు నరేశ్‌లు ద్విచక్ర వాహనంపై జగిత్యాల వైపు నుంచి వస్తుండగా రాజారం దర్గా సమీపంలో లారీవెనక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరికితీవ్రగాయాలు కాగా పోలీసులు జగిత్యాల ఆసుపత్రికి తరలించగా నరేశ్ చికిత్సపొందుతూ మృతిచెందాడు. నరేశ్ ఇటీవల ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్ శిక్షణకు వెళ్లి వస్తున్నక్రమంలో ప్రమాదం జరిగింది. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి


లస్మవ్వ(ఫైల్)

మెట్‌పల్లిరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిరూరల్ మండలం జగ్గసాగర్ గ్రామశివారులోని వడ్డెరకాలనీకి చెందిన దుండుగుల లస్మవ్వ(44) భర్తతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ సోమవారం ప్రమాదవశాత్తు జారిపడిమృతిచెందింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. లస్మవ్వ భర్తతోకలిసి ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళ్తుండగా తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే మెట్‌పల్లి ప్రభుత్వఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. భర్త దండుగులనర్సయ్య ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో లారీ డ్రైవర్ మృతి

పాలకుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బసంత్‌నగర్ గ్రామానికి చెందిన దేవిశేఖర్(43) అనే లారీడ్రైవర్ వడదెబ్బతో సోమవారం మృతిచెందాడు. శేఖర్‌సిమెంటులోడుతో శనివారం వైజాగ్ వెళ్లాడు. ఆదివారం తిరుగుప్రయాణంలో వాంతులు, విరేచనాలు కావడంతో క్లీనర్ సహాయంతో 108లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని కుటుంబ సభ్యులుతెలిపారు. మృతదేహన్ని వైజాగ్‌నుంచి బసంత్‌నగర్‌కు సోమవారం తీసుకు వచ్చారు. కాగా మృతుడికి భార్య కూతురు ఉన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు

● వరుస దొంగతనాలతో బెంబేలు ● తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
● పనిచేయని నిఘానేత్రాలు



గంభీరావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలంలో ఇటీవల వరుసదొంగతనాలు జరుగుతున్నాయి. తాళాలు వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఊర్లకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. నాగంపేటలో శనివారం రాత్రి దొంగలు తాళాలు వేసిన 10 ఇళ్లలో బీభత్సం సృష్టించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 10ఇళ్లలో దొంగతనానికి పాల్పడటంతో స్థానికులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏదో ఒకగ్రామంలో ఒకటిరెండు ఇళ్లకే పరిమితమైన దొంగతనాలు పది ఇళ్లకు విస్తరించడంతో వామ్మో ఇవేమి దొంగతనాలు అంటూ ప్రజలు వనికిపోతున్నారు. ఈ మధ్యనే కోళ్లమద్దిలో కూడా రెండు తాళాలు వేసిన రెండుఇళ్లలో దొంగలు బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. కోళ్లమద్దిలో దొంగతనం జరిగి, వారం కూడా గడవక ముందే నాగంపేటలో దొంగలు ఏకంగా10 ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు.

పోలీస్ పెట్రోలింగ్ తిరుగుతున్నా..

గంభీరావుపేట మండలంలో ఓ వైపు పోలీస్‌లు రాత్రివేళల్లో పెట్రోలింగ్ తిరుగుతున్నా దొంగతనాలు ఆగడం లేదు. రాత్రి సమయాల్లో పోలీస్‌లు గ్రామాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ తిరుగుతున్నారు. అయినా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీస్‌లకు సవాల్‌గా మారిన ఈ వరుస చోరీలను నివారించాల్సిన అవసరం ఉంది. దొంగలు ఈ ప్రాంతానికి చెందిన వారా.. లేక ఇతర ప్రాంతాలకు చెందిన దొంగల ముఠా సభ్యులా అనేది అంతుచిక్కడం లేదు.

పనిచేయని నిఘా నేత్రాలు

గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చాలా వరకు పనిచేయడం లేదు. పలు సంఘటనలను నివారించేందుకు దోహదపడే నిఘానేత్రాలు పనిచేయకపోవడం కూడా సమస్యగా మారింది. ప్రధాన కూడళ్లలో అప్పట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నాగంపేటలో ఒక్క గ్రామ పంచాయతీ ముందు ఉన్న సీసీ కెమెరా మాత్రమే పనిచేయగా, మిగితా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గ్రామంలోని అన్ని సీసీకెమెరాలు పనిచేస్తే దొంగతనాలపై ఏదైనా క్లూ దొరికి ఉండేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పాలకుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కొత్తపల్లి శివారులోని గుంపుల శ్రీనివాస్‌కు చెందిన మామిడితోటలో సోమవారం ఓవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బసంత్‌నగర్ ఎస్ఐ తెలిపిన వివరాలమేరకు మంథని మండలం లక్కేపురం గ్రామానికి చెందిన పండుగు మొగిళి(45) ఇటీవల ఓ మహిళ హత్య కేసులో నిందుతుడిగా మంథని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసుకు భయపడి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని మృతుడికుమారుడు అభిషేక్ ఇచ్చినఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

● ఎనిమిది మంది అరెస్ట్

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)! జగిత్యాల జిల్లాలో సోమవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడి చేసి ఎనిమిదిమంది పేకాటరాయు ళ్లను అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. రాయికల్ మండలం మైతాపూర్ శివారులో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై, జగిత్యాల పట్టణంలోని భవాని నగర్‌లో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. రెండు ఘటనల్లో ఎనిమిదిమంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 17,875 రూపాయల నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీసీఎస్ ఎస్ఐ రవీందర్, రమేష్, అఫ్రోజ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూషణరావుపేటలో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

● అర్ధాంతరంగా వెళ్లిపోయిన బీహార్ హమాలీలు


భూషణరావుపేటలో కొనుగోళ్లకు నోచుకోని ధాన్యం

కథలాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం భూషణరావుపేటలో సెర్ప్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రంలో ఐదురోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. బీహార్‌కు చెందిన హమాలీలు ఐదు రోజులు తూకం వేయగా నిర్వాహకులకు ఎలాంటి సమాచారం లేకుండా గురువారం వెళ్లిపోవడంతో ధాన్యం కొనుగోళ్ళు నిలిచిపోయాయని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిచి ముద్దయి పోయే పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఏపీఎం నరహరిని వివరణ కోరగా హమాలీ అర్ధాంతరంగా వెళ్ళిపోవడంతో కొనుగోళ్లు సాగడం లేదన్నారు. హమాలీల కోసం సమాచారం సేకరిస్తున్నామని మంగళవారం వరకు కొనుగోళ్లు జరిపేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, విజయరమణారావు

డీఎంఎఫ్‌టీ నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు...

గోదావరిఖని, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోల్‌బెల్ట్ ప్రాంతంలోని అభివృద్ధి పనుల కోసం అవసరమైన డీఎంఎఫ్‌టీ నిధుల విడుదల చేయాలని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు కోరారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో మైనింగ్ కారణంగా ప్రజల ఆరోగ్యంపై, జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలు, మంచినీటి సరఫరా, రహదారి, ఆరోగ్యశిబిరాలు, విద్య సౌకర్యాలు కల్పించేందుకు డీఎంఎఫ్‌టీ నిధులు అత్యంత కీలకమని, ఇప్పటికే నిధులు మంజూరైనా విడుదల విషయంలో ఆలస్యం జరుగుతోందని, వెంటనే విడుదల చేసి అభివృద్ధి పనులకు సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ప్రత్యేకంగా మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యత సంబంధిత శాఖలతో చర్చించి, త్వరితగతిన నిధుల విడుదల జరుగుతుందని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ తెలిపారు.

రైతులకు వరం.. ఉపాధి హామీ పథకం

- చిన్న, సన్నకారు రైతులకు మేలు
- మౌలిక వసతులు, నీటి సంరక్షణ, పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం

చొప్పదండి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉపాధి హామీ పథకం వరంలా మారింది. పారిశుధ్యం, నీటి సంరక్షణ, హరితహారం, చెక్‌డ్యాం, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదుల నిర్మాణాలను చేపడుతున్నారు. వీటితో పాటు రైతులకు పశువుల పాకలు, గొర్రెల పాకలను ఇటీవల మంజూరు చేయగా నిర్మాణాలను చేపట్టారు. సన్న, చిన్నకారు రైతులకు పందిరి కూరగాయల సాగు, చేపపిల్లల పెంపకానికి కుంటలను ఏర్పాటు చేయడం, పొలం గట్లపై మొక్కల పెంపకం, ఫాంపాండ్‌లను నిర్మిస్తున్నారు. రైతుల కోసం ఉపాధిహామీ పథకంలో ఉన్న కొన్ని పథకాల వివరాలు...



ఫాం పాండ్ తవ్వుతున్న కూలీలు(ఫైల్)

● బీడు భూముల అభివృద్ధి పథకం...

బీడు భూముల్లో బండరాళ్ల తొలగింపు, మీటరు లోతు సరిహద్దు కందకం తవ్వుతారు. రాతి కట్టలు, భూమిని చదు ను చేసి పూడిక మట్టిని రైతుల పొలాలకు తరలింపు, చిన్న ఊటకుంటల నిర్మాణం చేపడుతారు.

● మెట్ట భూముల అభివృద్ధి...

మెట్ట భూముల్లో గుళకరాళ్ల కట్టలు నిర్మిస్తారు. ఫాం పాండ్‌ల నిర్మాణం, బావుల్లో పూడిక తీస్తారు. నాడెపు కం పోస్టు, ఎరువు గుంత, సేద్యపు బావుల తవ్వకం చేపడతారు.

● పందిరి కూరగాయల పెంపకం...

చిన్న, సన్నకారు రైతుల భూముల్లో కూరగాయల పెంపకం చేపట్టి సుస్థిర ఆదాయం కల్పించేందుకు పందిరి కూరగాయల పెంపకం కోసం సబ్సిడీ అందజేస్తారు.

● పండ్ల తోటల పెంపకం...

సన్న,చిన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకం కోసం ఉపాధిహామీ పథకంలో ప్రభుత్వం సబ్సిడీని అందజేస్తుంది. ఈ పథకం కింద మామిడి, సీతాఫలం, మునగ, జామ, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, సపోట, బత్తాయి, అల్లనేరేడు మొక్కలను అందజేస్తారు.

● పశువుల పాక నిర్మాణానికి వంద శాతం సబ్సిడీ..

ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన సన్న, చిన్న కారు రైతులకు వంద శాతం సబ్సిడీపై పశువులు, గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల షెడ్ల నిర్మాణాలకు యూనిట్లను మంజూరు చేస్తున్నారు. పశువుల పాక నిర్మాణం కోసం 85,340, గొర్రెలు, మేకల పాకకు 92,000, నాటు కోళ్ల షెడుక్కు 38,344, అజోల్లా పెంపకం కోసం ట్యాంకుల నిర్మాణానికి 6499 రూపాయలను రైతులకు అందజేస్తారు.

● జల సంరక్షణ...

జల సంరక్షణలో భాగంగా రైతులు తమ పొలంలో ఫాంపాండ్స్ నిర్మించుకోవచ్చు. నీటిని నిల్వ చేసుకునే అవసరానికి తగ్గట్టుగా వినియోగించుకోవచ్చు. ఊటకుంట, నీటి నిల్వ కందకాలు, ఫీడర్ కాల్వలు, పంట కాల్వల నిర్మాణం, పశువుల నీటి తొట్టి, చేప పిల్లల పెంపకం కుంటం, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపడతారు.



ఫాం పాండ్



పశువుల పాక



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో ఆదివారం రాత్రి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన బదిలీలు, ప్రమోషన్లు, పెండింగ్ బిల్లుల మంజూరుకు కృషి చేస్తానన్నారు, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలకు బడ్జెట్లో మరింత నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నిధుల కేటాయింపులతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రయత్నిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారి జగిత్యాలకు విచ్చేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డిని తపస్ జిల్లా శాఖ పక్షాన సత్కరించారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపెల్లి ప్రసాద్‌రావు, ఇతర హోదాల బాధ్యు లు గడ్డం మహిపాల్‌రెడ్డి, మేన్నేని నీలిమ, చెరకు మహేశ్వర శర్మ, భాగ్యలక్ష్మీతో పాటు మండల బాధ్యులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోపై దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం

డాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్నప్రసన్నపై కొందరు దౌర్జన్యం చేయడం, బెదిరింపులకు పాల్పడడం వంటివాటిని ఖండిస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం డాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్ ఏర్పాటుకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు తని ఖీలు చేస్తున్నారని తెలిపారు. తనిఖీకి వచ్చిన డీఎంహెచ్‌ఓకు సహకరించకుండా ఆమెపైన దౌర్జన్యానికి దిగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడమే తమ విధి నిర్వహణ అని, ఏ ఒక్కరిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. బెదిరింపులు, దౌర్జన్యాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్‌ను అందుకుంటున్న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గొడుగు శివకృష్ణ కుటుంబ సభ్యులు

ఆంధ్రజ్యోతి కార్, బైక్ రేస్ విజేతలకు బహుమతుల అందజేత

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ కరీంనగర్ యూనిట్ స్థాయి ద్వితీయ, తృతీయ బహుమతుల విజేతలకు రిఫ్రిజిరేటర్, ఎల్ఈడీ టీవీని సోమవారం అందజేశారు. 'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ డ్రా మార్చి 24న నిర్వహించారు. కరీంనగర్ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఈ కార్యక్రమంలో పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ద్వితీయ బహుమతి విజేత పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గొడుగు శివకృష్ణ కుటుంబ సభ్యులు రిఫ్రిజిరేటర్‌ను అందుకున్నారు. తృతీయ బహుమతి ఎల్ఈడీ టీవీని కరీంనగర్ కశ్మీరుగడ్డకు చెందిన అన్వర్ హుస్సేన్ అందుకున్నారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి నగునూరి శేఖర్, ఎడిషన్ ఇన్‌చార్జి జయంత్‌రావు, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ పాపారావు పాల్గొన్నారు.



తృతీయ బహుమతి ఎల్ఈడీ టీవీ అందుకుంటున్న కరీంనగర్ కశ్మీరుగడ్డకు చెందిన అన్వర్ హుస్సేన్

రాజన్న క్షేత్రం భక్తజన సంద్రం



స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులు ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా రాజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఏఈవో శ్రావణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారిని టౌన్ సీఐ వీరప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు. వీరప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో పూజలు నిర్వహించారు. వేములవాడ రాజన్న ఆలయంలో జగద్గురు శంకరాచార్యులు జయంతి సోమవారం అర్చకులు ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 28 నుంచి మే నెల 2వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించను న్నట్లు తెలిపారు.

రాజన్న ఆలయ పలు విభాగాల్లో ఆకస్మిక తనిఖీ..: రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లో ఏఈవో శ్రావణ్ కుమార్ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారిని ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అత్యాధునిక పద్ధతుల్లో నిత్యాన్నదాన సత్రం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో నిర్మించే నిత్యాన్నదాన సత్రాన్ని ఆధునిక పద్ధతుల్లో నిర్మిస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శృంగేరి పర్యటనలో భాగంగా సోమవారం కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని నిత్యన్నదాన సత్రాన్ని, క్యూలైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని గుర్తుచేశారు. రూ.35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈవో వినోద్‌రెడ్డి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి, అర్చకులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారిణి

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 30 నుంచి మే 4వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి శ్రీహన్సి ఎంపికైంది. హైదరాబాద్‌లో గత ఫిబ్రవరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-11 ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న శ్రీహన్సి 1500 మీటర్ల రింక్, రోడ్ రేస్ విభాగా ల్లో రెండు బంగారు పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీ లకు ఎంపికైందని జిల్లా పాఠశా లల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బిర్లా పాఠశాలకు చెందిన శ్రీహన్సిని సోమవారం డీఈవో జనార్దన్‌రావు, సెక్టోరి యల్ అధికారి అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్ శిక్షకుడు హరి అభినందించారు.




శ్రీహన్సిని అభినందిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

అరచెయ్యే.. ఆటస్థలం..

- చిన్నారులు, యువతలో సెల్ గేమ్స్ క్రేజ్..
- మితిమీరితే కష్టమే

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు అర చేయి ఆట స్థలం అయింది.. ఆటగాళ్లు ఎందరున్నా, నియమాలు ఎలా ఉన్నా.. సెల్‌ఫోన్ స్టేడియంలో చిన్నారులు, కొత్తతరం కుర్రకారు, యువత ఒంటి చేత్తో ఆటలాడుతున్నారు. మొబైల్ గేమిం గ్ ధోరణి యువత జీవన శైలిలో ఓ భాగమైంది. అర చేతిలో ఇమిడే సెల్‌ఫోన్ ఇప్పుడు సరికొత్త కాలక్షేపంగా అలరిస్తోంది. మొదట్లో సెల్‌ఫోన్ కొనగానే అందులో కొన్ని గేమ్స్ మాత్రమే ఉండేవి. వాటిని ఆడుతూనే ఎంతో ఆనందించేవారు. చిన్నపాటి గేమ్స్‌కు ఉన్న ఆదరణను చూసే ప్రత్యేకంగా త్రీడీ, జావా గేమ్స్‌ను తయారు చేసే సంస్థలు పుట్టుకొచ్చాయి. వింత లోకంలోకి లాక్కెళ్లే సెల్‌ఫోన్ గేమ్స్ ఎంతో ఆదరణ పొందుతూ ఓ కొత్త ధోరణికి మార్గం ఏర్పరిచాయి. గేమ్స్‌లో సరికొత్త ట్రెండ్స్ కూడా వేగంగా దూసుకొస్తున్నాయి.



● వేగంగా వ్యాప్తి..: కొత్త మొబైల్ గేమ్ మార్కెట్‌లోకి వస్తే చాలు.. చిన్నారులు, విద్యార్థులు, యువత యువకుల్లో సమాచారం వేగంగా వ్యాపిస్తోంది. గేమ్స్‌కు అలవాటు పడుతున్న వారంతా బ్యం దాలుగా మారిపోతున్నారు. పాఠశాలలు, కళాశాలల కూడళ్లలో సమయం దొరికినప్పుడల్లా వీటి గురించే చర్చలు నడుస్తున్నాయి. సరదాలు, షికార్లకు కొదవలేని సమయం కావడంతో వారు కొత్త దనం కోసం అర్రులుచాస్తున్నారు. ఎప్పటికప్పుడూ అంది వచ్చే సరికొత్త సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నారు. ఎస్ఎంఎస్ ద్వారా మొబైల్ సంస్థలు. ఇంటర్‌నెట్‌లో గేమింగ్ వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకుంట్ను వాళ్ల సంఖ్య కూడా పెరుగుతోంది.

● గేమ్స్‌తో జాగ్రత్త.. : మొబైల్ గేమింగ్‌తో కాలక్షేపం మాట అటుంచితే.. ఇదొక వ్యసనంగా మారుతుందని మానసిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. విద్యార్థి దశలో విలువైన సమయాన్ని వృథా చేసుకుంటూ సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు.

ఇన్నాళ్లు కంప్యూటర్ గేమ్స్‌తోనే సరిపెట్టుకునే వారంతా మొబైల్ గేమ్స్‌కు మారిపోతున్నారు. ఎందుకంటే సెల్‌ఫోన్ ఎక్కడికైనా తీసుకెళ్లే వెసులుబాటు ఉండడటంతో ఈ పరిస్థితి వచ్చింది. మొబైల్ గేమింగ్ వల్ల మానసిక ఆలసట, చదువు మీద ఏకాగ్రత లోపించడం వంటి దుష్ప్రభావాలు కూడా కలుగుతున్నాయి. వ్యసన పరులుగా మారితే మాత్రం ఎన్నో ప్రతికూల ప్రభావాలను చవి చూడాల్సి వస్తుంది. విద్యార్థులు సెల్‌ఫోన్ ఆటలతో శారీర కంగా, మానసికంగా బలహీనులవుతున్నారు. ఆలోచన శక్తి సన్నగిల్లుతుంది. విద్యలో వెనుకబడుతారు. సెల్‌ఫోన్ గేమ్స్‌తో విద్యార్థులు ఇతర పనులపై ఆసక్తి చూపకుండా పోయే ప్రమాదం ఉంది.

ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలి



పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య పేర్కొన్నారు. ట్రినిటీ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో సోమవారం జరిగిన డీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యా కమిషన్ కలిసి ఒక నిర్ణయానికి వస్తున్నారని, విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలను మూసివేయడంలో భాగంగా మండలానికి ఆరుప్రాథమిక పాఠశాలలను మూడు ఉన్నత పాఠశాలలను మాత్రమే ఉంచాలనే సంకల్పంతో చర్చలు జరుగుతున్నాయని, అలా చేయడం సబబు కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే పాఠశాలలను సెమిరెసిడెన్షియల్‌గా తీర్చిదిద్దాలని, ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, సాయంకాలం టిఫిన్ అందిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశముంటుందన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే.నారాయణరెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు సంబంధించిన బకాయిలు, పెన్షన్, మెడికల్ బిల్స్ జాప్యం చేయకుండా బడ్జెట్‌ను వెంటనే అందించాలని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రామ్‌కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్యామ్, కార్యవర్గ సభ్యుడు ఎం.తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌రెడ్డి, సభ్యులు కిషన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

అఖిల భారతీయ స్వర్ణకార సంఘ్‌కు కరీంనగర్ స్వర్ణకారులు

భగత్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ స్వర్ణకార సంఘ్‌కు కరీంనగర్‌కు చెందిన స్వర్ణకారులు పూర్ణాచారి, రవీంద్రాచారి ఎంపికయ్యారు. బిహార్‌లోని బుద్ధగయలో ఆదివారం అఖిల భారతీయ స్వర్ణకార్ సంఘ్ జాతీయ శాఖ అధ్యక్షుడు యశ్పాల్ చౌహన్, ప్రధాన కార్యదర్శి రవివర్మ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి, ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి ప్రతిపాదించగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కందు కూరి పూర్ణాచారిని జాయింట్ సెక్రటరీగా, శ్రీరామోజు రవీంద్రాచారిని జాతీయ ఈసీ మెంబర్‌గా ప్రకటించారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు.



పూర్ణాచారి, రవీంద్రాచారికి నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

కాళేశ్వరం ఎత్తిపోతలు లేనట్లే..!

(5వ పేజీ తరువాయి)

రం బ్యారేజీకి కూడా బుంగ పడింది. దీంతో ప్రభుత్వ కోరిక మేరకు ఎన్‌డీఎస్‌ఏ బృందం పరిశీలన మొదలు పెట్టాయి. 2023 చివరలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఎన్‌డీఎస్‌ఏ ప్రాథమికంగా మూడు బ్యారేజీలను పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని సూచించింది. ఆ మర మ్మతుల వల్ల బ్యారేజీలు ఆగవని భావించిన ఎన్‌డీ ఎస్‌ఏ గతేడాది వర్షాకాలంలో మూడు బ్యారేజీల్లో నీటి నిల్వలు చేయకుండా ఓపెన్ ఫ్రీ బ్యారేజీలుగా ఉంచా లని సూచించారు. 14 నెలల తర్వాత సంబంధిత అధి కారులు ఆ మూడు బ్యారేజీలు ప్రమాదంలో ఉన్నా యని నివేదిక ఇవ్వడంతో ఈ ఏడాది కూడా నీటి నిల్వ చేసే అవకాశాలు కనబడడం లేదు.

● తుమ్మిడిహెట్టిపై ప్రభుత్వం చూపు..

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల్లో పూర్తిగా నీటిని నిల్వ చేయలేని పరిస్థితి ఉంటే దీనికి ప్రత్యామ్నాయం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మిం చడమే ప్రత్యామ్నాయమని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఉంది. మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేపట్టినా, అవి అక్కరకు వస్తాయనే గ్యారంటీ లేదని, మూడు బ్యారేజీల నుంచి నీటిని ఎత్తిపోయడం వల్ల తడిసి మోపెడు కరెంట్ బిల్లులు రానుండడంతో, ఈ డబ్బు లతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ పూర్తి చేయవచ్చని భావిస్తున్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని ఈ ఏడాదే నిర్మిస్తామని ఇదివరకే రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ బ్యారేజీ పూర్తయితే గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీటిని తరలించడంతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 2 లక్షల ఎకరాల భూములకు సాగు నీరందించగలుగుతారు. దీని దృష్ట్యా ప్రభుత్వం చూపు తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపైనే ఉంది. అప్పటి వరకు వరుణుడిపైనే ఆశలు పెట్టుకోవాల్సి ఉంటుంది. లేదంటే సుందిళ్ల బ్యారేజీకి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకుని రావాల్సి ఉంటుంది.

జడ్జి స్వాతిగౌడ్‌కు సన్మానం



జడ్జి స్వాతిగౌడ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

మంథని, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో జడ్జి మూల స్వాతిగౌడ్‌ను సోమవారం సన్మానించారు. మంథని కోర్టులో న్యాయమూర్తిగా పని చేసి బదిలీ అయిన జడ్జి స్వాతిగౌడ్‌కు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. సీనియర్ సివిల్ జడ్జి భవాని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్‌ఎన్ హరిబాబు, జనరల్ సెక్రటరీ ఎం. సమేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వెలుగు ఆధ్వర్యంలో పురస్కారాల అందజేత

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 27న గోదావరిఖనిలో నిర్వహించిన ఉగాది పురస్కారాలలో భాగంగా పలు రంగాలలో సేవలందిస్తున్న కళాకారులకు, ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. గాయని మద్ది పద్మకు వెలుగు కళా సేవారత్న పురస్కారం, కాంపెల్లి సతీష్‌కు మానవత వెలుగు జాతీయ అవార్డు, విఠల్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సరళకుమారికి జాతీయ ఆచార్య దేవోభవ అవార్డులను వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, వెలుగు సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ సురభి శ్రీధర్, తెలంగాణ ఉద్యమ నాయకుడు శంకర్, డాక్టర్ లక్ష్మీవాణి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి రాజేందర్ అందజేశారు.

రక్తదాతకు అవార్డు



శంకర్‌కు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఐసీటీసీ సెంటర్‌లో కౌన్సిలర్‌గా పని చేసే కటుకు శంకర్‌కు మానవతా వెలుగు అవార్డును అందజేశారు. 26సార్లు రక్తదానం చేసిన శంకర్ హెచ్‌ఐవీ రాకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శంకర్‌కు అవార్డున అందజేశారు. లయన్స్‌క్లబ్ నాయకులు కిషన్‌రావు, పెద్దంపేట శంకర్, సురభి శ్రీధర్, లక్ష్మీవాణి పాల్గొన్నారు. అవార్డు సాధించిన శంకర్‌ను పలు స్వచ్ఛంద సంస్థ నాయకులు అభినందించారు.

ఖని కళాకారుడు మేజిక్ రాజాకు సత్కారం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన కళాకారుడు మేజిక్ రాజాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడులో సన్మానించారు. పల్నాడు జిల్లా మేజిషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో జరిగిన మేజిక్ ఫెస్టివల్‌లో రాజా పాల్గొని పలు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కరీంనగర్‌కు చెందిన మేజిషియన్ నరేన్ లెక్చర్ కమ్ డెమానిస్ట్రేషన్, సీనియర్ల ప్రశంసలందుకున్నారు. కాగా మేజిక్ రాజాను రాజా, నరేన్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెజిషియన్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి యతిరాజ్‌ను అతిథులు, నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

సీడ్ కంపెనీలు పరిహారం చెల్లించాలి

ఎలిగేడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సీడ్ కంపెనీలు రూ.3వేల రూపాయలు మద్దతు ధరను చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు గ్రామాల్లో సీడ్ ధాన్యాన్ని పండించిన రైతులతో ఆయన సమావేశమయ్యారు. సన్నరకాలకు మద్దతు ధరతో పాటు ప్రభుత్వం అందిస్తున్న బోనస్ 500రూపాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రైవేట్ సీడ్ కంపనీలు క్వింటాలుకు రూ3వేల మద్దతు ధరను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వేసవి క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏరియా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీ నుండి అబ్దుల్‌కలాం స్టేడియంలో క్రీడా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. వాలీబాల్, ఫుట్ బాల్, బాస్కెట్ బాల్ క్రీడల్లో నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు, పరిసర ప్రాంతాలకు చెందిన చిన్నారులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు ఆర్జీ-2 పర్సనల్ విభాగంలో ఈనెల 29లోగా పర్సనల్ విభాగంలో లేదా అబ్దుల్ కలాం స్టేడియంలో నేరుగా తమ పేర్లను చేసుకోవాలని అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రారంభమైన ఉచిత శిక్షణ

జూలపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం న్యూలియో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండి తాహెర్‌పాష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణ శిబిరంలో వేదిక్ మ్యాథమెటిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్, మెడిటేషన్, యోగా, మైండ్‌గేమ్స్, పజిల్స్‌ను రామకృష్ణ వివేక సేవాసమితి వారు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆచార్యులు విజయ్, ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, నాగరాజు, ప్రసాద్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైందని, అందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ వెంట ఉన్నారని, ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిరూపించిందన్నారు. రజతోత్సవ సభకు 5వేల మంది ఈ ప్రాంతం నుంచి తరలివచ్చారన్నారు. బీఆర్ ఎస్ రజతోత్సవ సభ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగడానికి వస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలన్నారు. సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, గోపు ఐలయ్య యాదవ్, కుమ్మరి శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, కల్వచర్ల కృష్ణవేణి, బొడ్డు రవీందర్, ముద్దసాని సంధ్యారెడ్డి, నీరటి శ్రీనివాస్, పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ రజతోత్స వాన్ని పురస్కరించుకొని వరంగల్‌లో ఏర్పాటు చేసిన అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేశారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పార్టీ పిలుపు మేరకు మంథని నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి అధిక సం ఖ్యలో క్యాడర్‌ను కదలించామన్నారు. కేసీఆర్ స్పీచ్ పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో ఉత్సాహాన్ని నింపిందన్నారు. బహిరంగ సభ విజయవంతంపై హర్షం వ్యక్తం చేశారు.

మేడే ను దీక్షా దినంగా నిర్వహించాలి



కరపత్రం విడుదల చేసిన కార్మిక నాయకులు

ముత్తారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను దీక్షా దినంగా నిర్వహించాలని కరపత్రాలను సోమవారం ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. జిల్లా సహాయ కార్యదర్శి, సీపెల్లి రవీందర్,జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ లు మాట్లాడుతూ మేడేను ఉత్సవంగా కాకుండా పోరాట దినంగా నిర్వహించాలని అన్నారు.చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం జరిగిన పోరాట స్ఫూర్తితో అనేక దేశాల్లో కార్మిక వర్గం ఎర్ర జెండా అండతో తిరుగుబాటు చేసిందని, భారత దేశంలో కార్మిక వర్గం స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత అనేక పోరాటాలు, సమ్మెలు, త్యాగాలు, ఉద్యమాలు నిర్వహించి 29 కార్మిక చట్టాలను సాధించిందని అన్నారు. గజ్జెల రాజకుమార్,వెంకటేష్,నాయకులు నాదం,శ్రీనివాస్,దుర్గయ్య,నరేష్,రవి,మల్లేష్ పాల్గొన్నారు.

కార్మిక శాఖ అధికారికి పిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బొంకూరి కైలాసం

పెద్దపల్లిటౌన్, ఎప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) పెద్దపల్లి మండలం రాంపల్లి పీవిసి ఇటుకబట్టీల్లో వలస కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని దళిత బహుజన లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొంకూరు కైలాసం సోమవారం ఉమ్మడి జిల్లా కార్మిక శాఖ అధికారికి పిర్యాదు చేశారు. పిల్లలకు పాఠశాల ఏర్పాటు చేయకుండా పని చేయిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై దుర్భాషలాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట అలువాల ప్రశాంత్, ఆరెపల్లి క్రాంతి కుమార్, కండె కరుణాకర్ పాల్గొన్నారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



గోదావరిఖనిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఎంఎస్ నాయకులు, పెద్దపల్లిలో ఐటీఐ వాకర్స్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని బీజేపీ సీనియర్ నాయకులు పల్లె సదానందం పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తున్నామన్నారు. మానవాళికి వ్యతిరేకంగా జరిగే ఇటువంటి అనాగరిక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. నేటి బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పర్శ సమయ్య, మౌటమ్ నర్సింగం, మొర మనోహర్, శివంగారి సతీష్, మంథని కృష్ణ రాజవీర్, పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్,(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. పాకిస్తాన్ ఉగ్రవాద మూకలను తరిమికొడతాం. జైభారత్ అంటూ నినాదాలు చేస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అన్నాడి వెంకటిరెడ్డి, సందీప్, సంపత్ రెడ్డి, స్వామి, కొట్టె లక్ష్మయ్య, గుంటి కుమార్, రాజమల్లు, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి బీఎంఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. స్థానిక యూనియన్ కేంద్ర కార్యాలయం చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పహల్గావ్ పర్యాటక కేంద్రంలో హిందువులపై కాల్పులు జరిపి చంపిన పాకిస్తాన్ తీవ్రవాదుల పిరికిపంద చర్యగా అభివర్ణించారు. నాయకులు మాదాసి రవీందర్, కర్రావుల మహేష్, వడ్డేపల్లి కుమారస్వామి, దారావత్ తిరుపతి, మీనుగు సంతోష్, గంగిశెట్టి నరసింహులు, ఎల్లావుల కోటయ్య, రాజశేఖర్, పల్లె శ్రీనివాస్, సల్ల వేణు, పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లో ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూ రాలని రామగుండం రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొ త్తులతో ర్యాలీ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు అమరేందర్‌రావు మాట్లాడుతూ ఉగ్రవాదులు దాడి చేసి పర్యా టకులను పొట్టన పెట్టుకున్నారని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మంథెన శ్రీనివాస్, చెరుకు బుచ్చిరెడ్డి, అశోక్‌రావు, జీవన్‌బాబు, చింతల రాజిరెడ్డి, మంచికట్ల బిక్షపతి, రాజేందర్, పాల్గొన్నారు.

నేడు ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 10గంటలకు ఐఫోన్ తయారీ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓఝా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సుబ్బారావు, టీఎస్‌కేసీ మెంటార్ ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసి 18 సంవత్సరాల నుంచి 32 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు వారి రెజ్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో మేళాకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇందుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని, ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మేళా నిర్వహించబడుతుందని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు సాయంత్రంలోపే ఎంపిక పత్రాలను అందజేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

నెలాఖరుతో ముగియనున్న ఎల్‌ఆర్‌ఎస్ గడువు

కమాన్‌పూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 25శాతం రాయితీతో కూడిన ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపునకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని మంథని డీఎల్‌పీఓ కే సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30తో ఈ గడువు ముగుస్తుందని, ఇంకా ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించని వారు త్వరగా చెల్లించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గడువు ముగింపు తరువాత ఈ రాయితీ ఉండదని ఆయన స్పష్టం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముత్తారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిగంటి రాజేశం తల్లి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని సోమవారం ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజి పరామర్శించారు. చెల్కల జితేందర్ యాదవ్,గ్రామ శాఖ అధ్యక్షులు నర్ల మల్లయ్య,మాజీ ఎంపిటీసి బండ సమ్మయ్య,నాయకులు చెల్కల ఓదెలు,కిషన్,ఒడ్నాల సమ్మయ్య, బత్తుల మల్లయ్య, జంగిటి తిరుపతి,ఇట్టం గట్టయ్య,బండ పోచాలు వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముత్తారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఐకెపి ఆధ్వర్యంలో నూతన వరి కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పిస్తుందని అలాగే 500 రూపాయలు బోనస్ను ప్రకటిస్తుందని దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రక్షణకు పోలీస్ అవుట్ పోస్ట్

భగత్‌నగర్/కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రక్షణకు ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీస్ అవుట్‌పోస్టను ఏర్పాటు చేస్తున్నామని సీపీ గౌస్‌ఆలం అన్నారు. బస్టాండ్‌లో పోలీస్ అవుట్ పోస్టను సోమవారం ఆయన ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న 45 సీసీ కెమెరాలను కంట్రోల్ రూంకు అనుసంధానం చేశామన్నారు. మరో 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. టౌన్ ఏసీపీ వెంకటస్వామి, వన్ టౌన్ సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్ఐ రాజన్న పాల్గొన్నారు.

సింగరేణి నీటి బిందువు.. జలసింధువుపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న ఆర్జీ-1 అధికారులు

గోదావరిఖని, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం ప్రవేశపెట్టిన నీటి బిందువు జలసింధువుపై సోమవారం డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వరరావు, ఫారెస్ట్ అడ్వయిజర్ ఎంసీ పర్గెన్, జీఎం(ఎన్విరాన్‌మెంట్) సైదు లు ఏరియా జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఏరియాల్లో సుమా రు 70 నూతన చెరువులను, సుమారు 50 పాత చెరువుల్లో పూడిక తీసే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ సంవత్సరం సింగరేణి వ్యాప్తంగా సుమారు 670హెక్టాలలో ఓబీ డంప్‌లపై ఖాళీ స్థలంలో, రోడ్ల వెంట మొక్కలు నాటడానికి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని, వాటికి కావాల్సిన మొక్కలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని, మొక్కలతోనే మానవ మనుగడం సాధ్యమని అన్నారు. అన్ని ఏరియా జనరల్ మేనేజర్లతోపాటు ఆర్జీ-1 ఏరియా నుంచి ఇన్‌చార్జి జీఎం గోపాల్ సింగ్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయులు, బానోత్‌కర్ణ, సివిల్ ఎస్ఈ వరప్రసాద్ పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ఆర్జీ-3 జీఎం : సుధాకర్‌రావు

రామగిరి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సింగరేణి నిర్వహించే ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతీ సంవత్సరం వేసవిలో వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్‌అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2025-26 సంవత్సరానికి 18 సంవత్సరాలలోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఈ నెల 29 నుంచి 25 రోజులపాటు స్థానిక రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఫుట్‌బాల్, ఆర్చరీ, హకీ, క్రీడల్లో శిక్షణ కల్పించనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని సూచించారు.



రేపటి నుంచి ఆర్‌జీ-1 ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-1 ఆధ్వర్యంలో బుధవారం నుంచి నెలరోజులపాటు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు ఆర్‌జీ-1 అధికార ప్రతినిధి డి.కిరణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగుల పిల్లలు, మాజీ ఉద్యోగుల, పరిసర ప్రభావిత ప్రాంత పిల్లలకు నెల రోజుల పాటు ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, ఆర్చరీ, బాక్సింగ్, కరాటేలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న శిక్షకులు, శిక్షణ తీసుకునే విద్యార్థులు జీఎం కార్యాలయంలోని స్పోర్ట్స్ కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాల సెక్టార్ -2లో సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను మంగళవారం నుంచి నెలరోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలి

ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరివి రాజ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మే 20న చేపట్టనున్న టోకెన్ సమ్మెలో సింగరేణి కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరివి రాజ్‌కుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం కాలనీలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా ఒకరోజు సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు నిర్ణయించినట్టు తెలిపారు. కోల్ ఇండియాతోపాటు సింగ రేణిలో సమ్మె జరగనున్నట్టు పేర్కొన్నారు. లేబర్ కోడ్‌ల సవరణతో నాలుగు కోడ్‌లుగా కుదించడాన్ని కార్మిక సంఘాల ఉనికికి ప్రమాదమని పేర్కొన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏదైనా సంస్థ, కర్మాగారంలో 400 మంది కార్మికులు ఉంటేనే యూనియన్ ఏర్పాటు చేయాలనే నిబంధనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు రాజ్ కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కొత్త గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు రూ.25వేల కనీస వేతనం అమలు చేయాలని, చట్టబద్ధ హక్కులు, వసతులు, వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలన్నారు. పెర్క్స్ మీద ఇన్‌కంటాక్స్‌ను రీయంబర్స్ కోల్ ఇండియాలో అమలు అవుతున్నా సింగరేణి యాజమాన్యం చేయడం లేదని తెలిపారు. డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు, ప్రకాష్, రాజారత్నం, జిగురు రవీందర్, అన్నారావు, తిరుపతి, వెంకటేశ్వర్లు, సత్య నారాయణ, లెనిన్ పాల్గొన్నారు.

రామగిరి: మే 20న నిర్వహించే టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. అనంతరం పహల్గాం మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టి నివాళులు అర్పించారు. డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీరావు, నాయకులు సమ్మయ్య, రామచంద్రారెడ్డి, గంగాధర్, వెంకటస్వామి, శ్రీనివాస్, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.